### బీఆర్ఎస్ నాయకుడిని మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మెదక్ మున్సిపాలిటీ, జూన్3: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఖాజాను పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, జయరాజు, శ్రీనివాస్ ఉన్నారు.

### అర్హులైన రైతులకు రైతునేస్తం రుణాలు



రైతుకు చెక్కు అందజేస్తున్న చైర్మన్ బాదె చంద్రం

రామాయంపేట, జూన్ 3: రైతునేస్తం పథకం కింద అర్హులైన రైతులకు భూమి అభివృద్ధికి రుణాలు ఇస్తున్నట్లు రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం తెలిపారు. మంగళవారం సొసైటీలో అక్కన్నపేటకు చెందిన రైతు బక్కన్నగారి యాదగిరికి రూ.12లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో నర్సింహులు, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

### మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



చిలిపిచెడ్, జూన్ 3: మంజీరా, చెరువు, శిఖం భూముల్లో అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సహదేవ్, ఆర్ఐ సునీల్ సింగ్ చౌహాన్ హెచ్చరించారు. సామ్ల్యా తండా శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానికి రూ.5వేలు, జేసీబీ యజమానికి రూ.5 వేలు జరిమానా వేసినట్లు తెలిపారు.

### రామాయంపేట సబ్ రిజిస్ట్రార్‌గా సాగర్



రామాయంపేట, జూన్ 3: రామాయంపేట సబ్ రిజిస్ట్రార్‌గా ఉండ్రాళ్ల సాగర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యు పెంచి అభివృద్ధికి పాటుపడుదామన్నారు. రిజిస్ట్రార్ పరిధిలో ఉన్న రైతులు నేరుగా తనను కలిసి పనులు చేసుకోవాలన్నారు. దళారీలకు చోటు లేదన్నారు.

### కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

నిజాంపేట, జూన్ 3: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మంగళవారం బచ్చురాజ్‌పల్లిలో ఉపాధి పనులపై ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శశిరేఖ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, పంచాయతీ కార్యదర్శి రాములు, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ తదితరులు ఉన్నారు.

### చెరువులో నిర్మించిన రోడ్డు తొలగింపు

వెల్దుర్తి, జూన్ 3: చెరువును కబ్జా చేసి రోడ్డు నిర్మించడంపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఆ రోడ్డును తొలిగించారు. వెల్దుర్తికి చెందిన ఓ వ్యక్తి మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులోని కాన్ చెరువును కబ్జా చేసి తన వ్యవసాయ పొలానికి రోడ్డును నిర్మించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ రాజేందర్ మంగళవారం ఆ రోడ్డును హిటాచీ సాయంతో తొలిగించారు. చెరువులు, కుంటలు, శిఖాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అంత్యక్రియలకు కంతారెడ్డి ఆర్థిక సాయం




నిజాంపేట, మే3: రజాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని ఖాసీంపూర్ తండాకు చెందిన ధరావత్ నాణ్య(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డి, స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

### హస్తాల్‌పూర్‌లో నీటి సమస్య పరిష్కారం

వెల్దుర్తి, జూన్ 3: మడంలంలోని హస్తాల్‌పూర్‌లో తాగునీటి కోసం జెండా ఆవిష్కరణను అడ్డుకుని, పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. దీనిపై స్పందించిన మిషన్ భగీరథ అధికారులు మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ పలువురు అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతుంది, బంద్ కావడానికి కారణాలు ఏమిటి, వాటి గురించి పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులతో చర్చించారు. అనంతరం గంగిరెద్దుల వాడకు నీటి సరఫరాను పునరుద్ధరించడం, ఎస్సీ కాలనీకి బుధవారం లోగా నీటిని అందించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

### కారు ఢీకొని వ్యక్తి మృతి



కోల రమేశ్(ఫైల్)

కౌడిపల్లి, జూన్ 3: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని (తనికి) దేవుల తండాలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోల రమేశ్ (38) తన ఇంటి నుంచి రోడ్డు అవతల పక్కన ఉన్న తన వ్యవసాయ పొలంలో నీళ్లు పారించడానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా మెదక్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

చిన్నశంకరంపేట, జూన్3: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో పుష్పవేణి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట, శాలిపేట, ఖాజాపూర్, జంగరాయి గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వం పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సుకు పాటు పడే నాయకుడు హరీశ్‌రావు



హరీశ్‌రావు పుట్టిన రోజును సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి



పెద్దశంకరంపేట: హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు




బీఆర్ఎస్ నేతలు తయారు చేయించిన మాజీ మంత్రి హరీశ్‌రావు కేక్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ఘనంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/రామాయంపేట/టేక్మాల్/మనోహరాబాద్/పెద్దశంకరంపేట/శివ్వంపేట, జూన్ 3: నిరంతరం ప్రజల శ్రేయస్సుకు పాటు పడే నాయకుడు.. జన హృదయ నేత మాజీ మంత్రి హరీశ్‌రావు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేకులు కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో సర్వమత ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, బీఆర్ఎస్ నేతలతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామాయంపేట: జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపిస్తున్న రామాయంపేట నాయకులు



టేక్మాల్‌లో హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శివ్వంపేటలో కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మాజీ ఎంపీటీసీ చింతల స్వామి..

# రేషన్ కోసం గంటల కొద్దీ నిరీక్షణ

- రామాయంపేటల్లో 25 దుకాణాలు, నిజాంపేటలో 10 దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా
- బియ్యం కోసం బారులుదీరిన కార్డుదారులు
- అరకొరగా రేషన్ బియ్యం సరఫరా
- బియ్యం దొరకక ఇబ్బందిపడ్డ ప్రజలు



చిన్నశంకరంపేట: మిర్జాపల్లిలో రేషన్‌బియ్యం కోసం గుమిగూడిన జనం



రామాయంపేట: క్యూలైన్‌లో ఉండి బియ్యం తీసుకుంటున్న కార్డు దారులు

రామాయంపేట/నిజాంపేట, జూన్ 3: మూడు నెలల బియ్యం పంపిణీ ఏమో కాని బియ్యం కోసం రేషన్ షాప్‌ల వద్ద లబ్ధిదారుల నిరీక్షణ అంతా ఇంత కాదు. గత నెల రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తామంటూ ప్రచారం చేశాయి. మంగళవారం 3 నెలల బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో రేషన్ షాపులపై కార్డు దారులు ఒక్కసారిగా రావడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం సరఫరా అయిన రేషన్‌షాప్‌ల వద్ద లబ్ధిదారులు గంటల కొద్దీ బియ్యం కోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. ఒక్కో లబ్ధిదారుడు ఈ-పాస్ మిషన్‌పై 3 నుంచి 6 సార్లు వేలిముద్ర వేయడం, దాదాపుగా 20 నిమిషాల మేర సమయం తీసుకోవడం, ఆన్‌లైన్, నూతన సాఫ్ట్‌వేర్‌తో పాటు ఈ నెలలోనే కొత్తగా రేషన్ కార్డులు వచ్చిన లబ్ధిదారుల తాకిడితో రేషన్ డీలర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దీంతో రేషన్ లబ్ధిదారులపై, ప్రభుత్వంపై రేషన్ డీలర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం సరఫరా కాని గ్రామాల్లో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామాయంపేట సివిల్ సప్లై అధికారులు ప్రతి నెలా చిన్నశంకరంపేట, రామాయంపేట, నిజాంపేట మండలాలలోని 68 రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తారు. ఈసారి మాత్రం 25 షాపులకే రేషన్ బియ్యం అందించారు. నిజాంపేట మండలంలోని 18 రేషన్‌షాప్‌లు ఉండగా ప్రభుత్వం కేవలం 10 షాప్‌లకు మాత్రమే సన్నబియ్యం సరఫరా చేశారు. దీంతో షాపుల వద్ద కార్డు దారులు కుస్తీ పట్టాల్సి వస్తున్నది. ఒక్కో దగ్గర క్యూలైన్‌లో నిలబడ్డా చివరకు బియ్యం దొరకలేదు. సంబంధిత అధికారులను వివరణ కోరగా లారీల కొరత కారణంగా డీలర్లకు బియ్యం సరఫరా చేయలేకపోయామని చేతులెత్తేశారు. చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లిలో 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణి చేయడంతో ఒక్కసారిగా లబ్ధిదారులు బారులుదీరారు. సరిగ్గా సిగ్నల్ రాకపోవడంతో బియ్యం ఇవ్వడానికి ఒక్కొక్కరికి 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టింది. దీంతో రేషన్ దుకాణం ముందు పడిగాపులు పడవల్సిన దుస్థితి నెలకొంది.



నిజాంపేట: జనం రాక బోసిపోయిన కల్వకుంటలో బియ్యం సరఫరా కాని రేషన్‌షాప్



రామాయంపేటలో బియ్యం కోసం తోపులాడుతున్న రేషన్ కార్డుదారులు



నిజాంపేటలోని రేషన్‌షాప్ వద్ద బియ్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

# నాసిరకం విత్తనాలతో జాగ్రత్త

- రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి
- నకిలీ విత్తనాలు విక్రయించినా, కొన్నా చర్యలు తప్పవు: వ్యవసాయాధికారులు



కౌడిపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోవిత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు



చేగుంట: ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలు, ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలోని పలు రైతువేదికల్లో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులకు వరి (mtu-1010), పెసర(mgg-295) విత్తనాలు అందజేశారు. రాజేంద్రనగర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారులు రైతులకు విత్తనాలు అందజేశారు. రైతులు తమ పొలాల్లో విత్తనాలు వేసుకుని వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో వారి సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. విత్తనాలు కొనేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. చీడపీడల నివారణకు తట్టుకునే విత్తనాలు వేసుకోవాలన్నారు. పంటలు వేసే ముందు రైతులు కచ్చితంగా భూసార పరీక్షలు చేయించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఫర్టిలైజర్ దుకాణదారులకు తెలిపారు. అనుమతి లేని విత్తనాలు, రసాయన ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణాదారుడు లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినా, కొన్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లోని రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలు విక్రయించొద్దని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు తీసుకునే రైతులు కచ్చితంగా రసీదు పొందాలన్నారు.ప్రభుత్వం గుర్తింపు ఉన్న దుకాణాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన మొలక శాతంలో తేడాలొస్తే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. విత్తనాల రసీదులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, జూన్ 3

# భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి



నర్సాపూర్: మంతూర్‌లో భూ భారతీ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ నగేశ్



చిన్నశంకరంపేట గ్రామ రెవెన్యూ సదస్సులు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి




నిజాంపేట: బచ్చురాజ్‌పల్లిలో భూ సంబంధ సమస్యల దరఖాస్తులను అధికారులకు ఇస్తున్న రైతులు

**- రెవెన్యూ సదస్సుల్లో అడిషనల్ కలెక్టర్**

రామాయంపేట/నర్సాపూర్/చేగుంట/నిజాంపేట/పెద్దశంకరంపేట/ చిన్నశకంరంపేట/వెల్దుర్తి, జూన్3: నర్సాపూర్ మండలంలోని మంతూర్‌లో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో అడిషనల్ కలెక్టర్ నగేశ్ పాల్గొన్నారు. ప్రజలు ఎక్కువగా పీవోటీ అసైన్‌మెంట్ భూముల గురించి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 2025 ఆగస్ట్ నాటికి భూ సమస్య లేని గ్రామంగా ప్రకటించడానికి అడిషనల్ కలెక్టర్‌తో కలిసి ఏకగ్రీవంగా సహకరిస్తామని వెల్లడించారు. నిజాంపేట మండలంలోని బచ్చురాజ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో భూ భారతి సదస్సు నిర్వహించారు. చేగుంట మండలంలోని చందాయిపేట, నార్సింగి మండలం భీంరావ్‌పల్లి గ్రామాల్లో భూభారతి సదస్సులను ఏర్పాటు చేసి, పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నార్సింగి మండలంలో 32 దరఖాస్తులు రాగా 13 సమస్యలు పరిష్కరించారు. రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో రెవెన్యు సదస్సును నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేటలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును మెదక్ ఆర్డీవో రమాదేవి సందర్శించి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. పెద్దశంకరంపేట మండలంలోని కొత్తపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు పలు భూసమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు

వెల్దుర్తి మండలంలోని నెల్లూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రైతు సదస్సుకు హాజరైన ఆర్డీవో జయ చంద్రారెడ్డి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు పరిశీలించి, రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారన్నారు. వెల్దురి మండలంలో ధర్మారం, మాసాయిపేట మండలంలో పోతంశెట్టిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు తహసీల్దార్లు బాలలక్ష్మి, జ్ఞానజ్యోతి పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

### బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే సునీతారెడ్డి



కౌడిపల్లి, జూన్3: మండలంలోని నాగ్‌సాన్‌పల్లిలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారికి బోనాలు ఊరేగించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఊరేగింపులో పాల్గొన్నారు. అనతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ అల్మాయిపేట ఎల్లం ఎమ్మెల్యేను సన్మానించారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

చేగుంట/చిన్నశంకరంపేట, జూన్ 3: సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు. మంగళవారం చేగుంటలోని పీహెచ్‌సీ, చిన్నశంకరంపేటలోని పీహెచ్‌సీలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ అనిల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు ఉన్నారు.

### నిప్పంటుకుని నేలకూలిన భారీ వృక్షం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రామాయంపేట, జూన్ 03ః రామాయంపేట-కామారెడ్డి పాత జాతీయ రహదారిపై ఓ భారీ వృక్షం నిప్పంటుకుని నేలకూలింది. మంగళవారం తెల్లవారుజామున రోడ్డు పక్కనే ఉన్న భారీ వృక్షానికి నిప్పంటుకుంది.నిప్పురవ్వలు ఎగిసిపడి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.దీంతో చెట్టుకు ఉన్న కొమ్మలు రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగి రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.విషయం తెలుసుకున్న రామాయంపేట అగ్రిమాపక శకట సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.స్థానికులు జేసీబీని తీసుకుని వచ్చి చెట్ల కొమ్మలను పక్కకు తొలగించారు.దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.చెట్ల కొమ్మల పక్కనే విద్యుత్ తీగలు ఉన్నాయి.ఎలాంటి ప్రమాదం జరుగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### సమస్యల నిలయంగా వెంకటేశ్వర కాలనీ



మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

నర్సాపూర్, జూన్ 3: మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీ సమస్యల నిలయంగా మారింది. కాలనీలో తాగునీరు, విద్యుత్, కుంట అలుగు పారే కాల్వ, మురుగు నీటి సమస్యలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వివిధ శాఖల అధికారులకు మంగళవారం మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, తహసీల్దార్, నీటి పారుదల శాఖ అధికారులు, ఏడీఈ రామ్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, కోశాధికారి అశోక్ పాల్గొన్నారు.

### నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



నర్సాపూర్, జూన్3: గతంలో ఈదురు గాలులకు మండలంలోని చిన్న చింతకుంటలో ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. సుమారు 2 నెలలు గడుస్తున్నా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయ లేదు. సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

### దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మనోహరాబాద్, జూన్ 3: దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, జిల్లా అధ్యక్షుడు సంజీవ్ డిమాండ్ చేశారు. పర్కిబండకు చెందిన బాధితులు నర్సింలు, రమేశ్, ఉదయ్‌ను మంగళవారం వారు పరామర్శించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కేసు చేసినట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

### బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి ఆర్థికసాయం



శివ్వంపేట, జూన్ 3: సికింద్లాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు సేగూరి చంద్రాగౌడ్ కుమారుడు ప్రభాకర్‌గౌడ్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా రూ.10వేలు, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రామారం నర్సింలు, సేగూరి కుమార్, సేగూరి నరేందర్, సేగూరి వెంకటేశ్, నర్సింలు ఉన్నారు.

### పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

కౌడిపల్లి, జూన్3: పరిస్థితి విషమించి వ్యక్తిమృతి చెందిన ఘటన రాజిపేటలో మంగళవారం జరిగింది. కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాంచ శ్రీకాంత్(31) అతడి భార్య స్వాతి 15 రోజుల క్రితం సంసారం విషయంలో గొడువపడి పుట్టింటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు భార్యను తీసుకురావడానికి అత్తగారింటికి వెళ్లగా ఆమె రాలేదు. మే 31న మళ్లి అత్తగారింటికి వెళ్లగా, రాను విడాకులు ఇస్తా అంటూ గొడువపడ్డారు. మనస్తాపానికి గుర్త్రై ఈ నెల 1న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.